క్లుప్తంగా

మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక సౌకర్యాలు

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూలా నక్షత్రం రోజున భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజు అమ్మవారి దర్శనానికి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఏర్పాట్లను మరింత పెంచి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది, లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు అధిక శాతంలో వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల వద్దకు సిబ్బందే వెళ్లి క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు తాగునీరు అందించాలని ఆదేశించారు.

దుర్గమ్మకు నాట్యనీరాజనం



విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదికపై కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులతోపాటు, బరంపురం, చెన్నై నుంచి వచ్చిన నృత్య కళాకారులు నృత్యసేవలో పాల్గొన్నారు. టి. వెంకటలక్ష్మి బృందం భక్తి సంగీతంతో ప్రారంభమయ్యాయి. బి.శ్రావణి, సీహెచ్ రవి అమ్మవారి మీద కృతులను ఆలపించారు. నృత్య కార్యక్రమంలో భాగంగా కె. చిన్నమయాచార్యులు, భాగవతుల వెంకట్రామ శర్మ, కె. నిర్మలాకుమారి, లాస్య, టి. సాయి కృష్ణ, శారదా రామకృష్ణ, జె. రమ్యవేద, భాగవతుల శ్రీనివాస శర్మ, బి. మల్లికార్జున రావు, దేవరకొండ చంద్రశేఖర్, దిలీప్ రాజన్, సీహెచ్ అజయ్‌కుమార్ తమ బృందాలతో కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర, జానపద నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను గంగాధర్, సైదా, రామ కృష్ణ నిర్వహించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అమ్మ వారి లడ్డూ ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు.

కళాకారులనూ అడ్డుకున్న పోలీసులు..

కనకదుర్గానగర్‌లో కళాకారుల కోసం నిర్మించిన వేదిక, కనకదుర్గానగర్‌కు వెళ్లడానికి ఎంట్రన్స్ పక్కపక్కనే ఉంటాయి. కొంతమంది పోలీసు అధికారులు పాస్ ఉంటేనే లోపలకి అనుమతినిస్తామని మొండికేస్తున్నారు. దీంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాకు వీఎం రంగా పేరు పెట్టాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలను త్వరలో 30 జిల్లాలుగా మార్పు చేస్తారన్నట్లుగా ప్రచారం జరుగుతోందని, ఆ విధంగా చేస్తే ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు వీఎం రంగా జిల్లా పేరు పెట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ తూర్పు కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణాజిల్లాగా, పశ్చిమ కృష్ణాకు వీఎం రంగా కృష్ణాజిల్లాగా పేర్లు పెట్టాలని సూచించారు. దివంగత వంగవీటి మోహన రంగారావు బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. గతంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా గెలిచి సేవలు అందించారని, ముఖ్యంగా కృష్ణలంకలోని పేదల ఇళ్ల పట్టాల కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా ఆమరణ నిరాహార దీక్షకు సైతం దిగారని గుర్తు చేశారు. ప్రజల కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన ప్రజా నాయకుడు వీఎం రంగా పేరును పశ్చిమ కృష్ణా జిల్లాకు సంబంధించి నామకరణం చేస్తే సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

సంబరంగా దసరా ఉత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో దసరా ఉత్సవం పేరుతో దసరా సాంస్కృతిక కార్యక్రమాలను కళాశాల విద్యార్థులు చక్కగా నిర్వహించారు. కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం పూజలు, వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించారు. మధ్యాహ్నం బతుకమ్మ, దాండియా, గార్బా తదితర నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేసేందుకు ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కె. రాఘవయ్య, ప్రిన్సిపాల్ కె. పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. మణికంఠ, వివిధ విభాగాధిపతులు డి. దుర్గాప్రసాద్, మహాలక్ష్మి, డాక్టర్ పి. శిల్ప, డాక్టర్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న ఈవో రామరావు, ఇతర సిబ్బంది









భక్తులు, భవానీలతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయ ప్రాంగణం



కుంకుమ పూజ చేస్తున్న దంపతులు



ముస్తాబవుతున్న హంసవాహనం



చిన్నారికి దర్శనం చేయిస్తున్న పోలీసు



సువాసినీ పూజ చేస్తున్న అర్చకుడు

జయ జయహే సిరివర్షిణీ

శ్రీదేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి శోభాయమానంగా వెలుగొందుతోంది. నలుదిక్కులా ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లుతోంది. అమ్మవారి దివ్య అలంకారాలను దర్శించుకుని భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమృత స్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజ లక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమష్టిరూపమైన మహాలక్ష్మిని భక్తలోకం మనసారా పూజించి.. ఐశ్వర్యప్రాప్తి, విజయం సిద్ధించాలని ప్రార్థించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోజ్ పార్క్‌లో సౌకర్యాలు నిల్

స్కేటింగ్ క్రీడాకారుల ఇబ్బందులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం హెచ్‌బీ కాలనీ హెచ్‌ఐజీలో ఏర్పాటు చేసిన రోజ్ పార్క్‌లో సౌకర్యాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. స్కేటింగ్ ప్రాక్టీస్ చేసేందుకు పార్క్‌లో స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేశారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి స్కేటింగ్ క్రీడాకారులు ప్రాక్టీస్ నిమిత్తం పార్క్‌కు వస్తున్నారు. అంతే కాకుండా రింక్ అనుకూలంగా ఉండటంతో పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. పోటీల సమయంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తరలివస్తున్నారు. అయితే సౌకర్యాలు లేక వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 72 లక్షలతో అభివృద్ధి

భవానీపురం 43వ డివిజన్ పరిధిలోని రోజ్ పార్క్ గతంలో చెత్తాచెదారంతో డంపింగ్ యార్డ్‌ను తలపించేది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్క్ అభివృద్ధిపై దృష్టి సారించింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 72 లక్షలతో పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. క్రీడాకారుల కోరిక మేరకు పార్క్‌లో స్కేటింగ్ ప్రాక్టిస్‌కు రింక్ ఏర్పాటు చేశారు. దాదాపుగా పార్క్‌లో పనులన్నీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్క్‌ను ప్రారంభించి శిలాఫలకం వేసుకున్నారు. తర్వాత పార్క్‌లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం పార్క్‌లో క్రీడాకారులు స్కేటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అసోసియేషన్ వాళ్లు స్కేటింగ్ టోర్నమెంట్స్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉంటే బాగుంటుందని క్రీడాకారులు అంటున్నారు.



రోజ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన స్కేటింగ్ రింక్‌పై ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు



తరలివచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు(ఫైల్)

సౌకర్యాల కొరత..

పార్క్‌లో ఏర్పాటు చేసిన స్కేటింగ్ రింక్‌లో ప్రాక్టీస్‌కు బాల బాలికలు వస్తున్నారు. వీరికి తోడు క్రీడాకారుల తల్లిదండ్రులు కూడా వస్తున్నారు. సెలక్షన్స్, టోర్నమెంట్‌ల సమయంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తరలివస్తున్నారు. సమీపంలో నివాసాలు ఉండటం, పార్క్‌లో ప్రత్యేకించి టాయిలెట్లు లేక క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బాలికలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు డ్రెస్సింగ్ రూం కూడా లేదు. రింక్ చుట్టూ స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. ప్రాక్టీస్ సమయంలో కొందరు అదుపు తప్పి రింక్ బయట పడిపోతున్నారు. రెయిలింగ్ ఏర్పాటు చేస్తే అదుపు తప్పినా దానిని పట్టుకుని నిల్చేందుకు అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం కూడా తక్కువ.

తక్షణమే సౌకర్యాలు కల్పించాలి..



పార్క్ స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ ప్రాంతానికి కళ వచ్చింది. క్రీడాకారులతో కళకళలాడుతోంది. ఇది మంచి పరిణామం. కానీ పార్క్‌లో టాయిలెట్లు, డ్రెస్సింగ్, రింక్‌కు రెయిలింగ్ లేవు. టోర్నమెంట్, సెలక్షన్స్, ప్రాక్టీస్‌లో భాగంగా వచ్చే క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తక్షణమే పార్క్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

–నర్సారెడ్డి, స్థానికుడు

ఉత్సవాల నిర్వహణలో ఘోర వైఫల్యం

దుర్గగుడి పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రశ్నలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని దుర్గగుడి పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్న భక్తులు పడుతున్న కష్టాలే అందుకు నిదర్శనమన్నారు. రూ.500 టికెట్ కొనుక్కొని క్యూ లైన్‌లో గంటల తరబడి పిల్లలు, వృద్ధులతో వేచి ఉండాల్సి వస్తోందంటే.. ఇది నిర్వహణ లోపం కాదా అని ప్రశ్నించారు. విజయవాడ కేఎల్‌రావు నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా యంత్రాంగం, ఆలయ కార్యనిర్వహణాధికారిపై ధ్వజమెత్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పాలక మండలి పదవీ కాలం ఉండగా ఉత్సవాలకు సంబంధించి సూచనలు, సలహాలు తీసుకోకుండా ఏక పక్ష నిర్ణయాలు ఎలా తీసుకుంటారని నిలదీశారు. ఉత్సవాలకు ముందు జిల్లా యంత్రాంగం నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశాలకు సైతం పాలక మండలిని పిలవలేదన్నారు. పాలక మండలి రద్దు అయ్యిందని చెబుతున్న ఆలయ ఈఓ అందుకు సంబంధించిన జీఓ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు.

ఉత్సవాల పేరుతో దోచుకుంటున్నారు..

దసరా ఉత్సవాల్లో భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం నాయకులు అందినకాడికి దోచుకుంటున్నారని చైర్మన్ కర్నాటి రాంబాబు మండిపడ్డారు. అందులో భాగంగానే జీరో టికెట్ విధానాన్ని ప్రవేశపెట్టి అమ్మవారి ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారని, అసలు జీరో టికెట్ ప్రతిపాదన ఎవరు చేశారో ఈఓ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రూ.10 కోట్లతో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందని, అయినా భక్తులకు కష్టాలు తప్పలేదని అన్నారు. అమ్మవారి ఆదాయానికి గండి పడకూడదనే ఉద్దేశంతో గత దసరా ఉత్సవాల్లో అప్పటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ లక్షలాది రూపాయల సొంత ఖర్చుతో టికెట్లు కొని జిల్లా యంత్రాంగానికి పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జీరో టికెట్ పెట్టి రీసైక్లింగ్ చేస్తూ దోచుకుంటుందని విమర్శించారు.



పాలక మండలి కాలపరిమితికి సంబంధించిన జీఓ కాపీని చూపుతున్న రాంబాబు

న్యాయపరంగా ముందుకు..

దసరా ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సి ఉండగా ప్రతిపక్షం పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని చైర్మన్ కర్నాటి రాంబాబు విమర్శించారు. నగర ప్రథమ పౌరురాలైన మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ప్రొటోకాల్ దర్శనం చేయించాల్సి ఉండగా అడుగడుగునా అడ్డంకులు సృష్టించి అవమానించటం దుర్మార్గమన్నారు. ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ వేస్తారుగానీ కూటమి ప్రభుత్వం మాత్రం సేవా కమిటీ పేరుతో జంబో కమిటీ వేసిందని, వారంతా కేవలం తమవారికి మాత్రమే దర్శనం చేయించటానికి పరిమితం అవుతున్నారు తప్ప భక్తులకు సేవలు అందించటం లేదని విమర్శించారు. దసరా ఉత్సవాలు, పాలక మండలికి సంబంధించిన పలు అంశాలపై ఈఓ, దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాశానని, వారిచ్చిన సమాధానం తరువాత న్యాయపరంగా ముందుకు వెళతానని చెప్పారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు నంబూరి రవి, భక్తుడు కేసరి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. దోపిడీలోనూ ఘనాపాఠి

వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద బాధితుల సాయంలోనూ దోపిడీ చేసిన ఘనాపాఠి కూటమి ప్రభుత్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరి కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ విమర్శించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆసిఫ్ మాట్లాడారు. వరద సాయానికి సంబంధించి నెలా 15 రోజులు దాటినా ఇంకా బాధితులకు సాయమందలేదన్నారు. ఇంకా వేలాది మంది కలక్టరేట్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. తొలిగా సాయమందించే క్రమంలో సుమారు లక్ష కుటుంబాలకు రూ.166 కోట్లుగా ప్రకటించారని గుర్తు చేశారు. నేడు 1.71 లక్షల మందికి రూ.280 కోట్లు సాయమందించినట్లు కలెక్టర్ ప్రకటించారన్నారు. అయితే సుమారు 70 వేల మంది ఎలా పెరిగారని ప్రశ్నించారు. తప్పుల తడకగా ఎన్యూమరేషన్ చేయటం వల్ల ఇంకా వేలాది మంది సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని దుయ్యబట్టారు. మొత్తం రూ. 280 కోట్ల మేర సాయం చూపించి సుమారు రూ.534 కోట్లు ఈ కూటమి ప్రభుత్వం టెండర్ పెట్టినట్లుగా వార్తలు వస్తున్నాయన్నారు.

కింద అంతస్తులో ఉన్నవారిని పైఅంతస్తుగా చెబుతున్నారని, అలాగే చాలా మందికి మ్యాపింగ్ కాలేదని తోసిపుచ్చారని వివరించారు. వరద సాయం ఎగ్గొట్టడానికి అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దాతలిచ్చిన సాయాన్ని సైతం కూటమి ప్రభుత్వం దోపిడీ చేయటం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

ఘనంగా తుమ్మలపల్లి శ్రీహరినారాయణ జయంతి



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం స్థల దాత, తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహ వ్యవస్థాపకుడు డాక్టర్ తుమ్మలపల్లి శ్రీహరినారాయణ 140వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీహరినారాయణ విగ్రహానికి తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ బ్రాహ్మిణ్ స్టూడెంట్స్ హోమ్ ట్రస్ట్ సభ్యులు, పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు ఎం. సత్యనారాయణరావు, డాక్టర్ జి. ఈశ్వర్, కార్యదర్శి జీవీఎస్ఎస్ రాఘవరావు, సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వరద సాయంలోనూ అంతులేని అవినీతి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడలోని వరద బాధితులకు సాయం అందించే పేరుతో కూటమి ప్రభుత్వం అంతులేని అవినీతికి పాల్పడిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. వరదలలో సైతం అవకాశాలు వెతుక్కొని అవినీతి చేసిన మహానుభావుడు చంద్రబాబు అన్నారు. వరదల్లో ప్రజలకి సేవ చేయాల్సింది పోయి వచ్చిన డబ్బులను సైతం దండుకోవడానికి, ప్రతి ఒక్కదాంట్లో దోచుకోవడానికి చంద్రబాబు దిగజారారన్నారు. చంద్రబాబు వరదల కారణంగా పెట్టిన ఖర్చులలో భోజనానికి సుమారు రూ.368 కోట్లు, వసతి కోసం కోటి రూ. 40 లక్షలు, ఖర్చు పెట్టినట్లు తెలిపారు. అయితే ఆరు లక్షల మందికి భోజనాలు పెట్టారని చెబుతున్న ప్రభుత్వం ఆలయాలు, స్వచ్ఛందసేవా సంస్థలు, అక్షయ పాత్ర వంటి సంస్థలు ఎవరికి ఆహారాన్ని అందించాయో చెప్పాలన్నారు. అలాగే మంచి నీళ్లకు రూ.26 కోట్లు, అగ్గిపెట్టె కొవ్వొత్తులకు రూ.23 కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలిపారని, అవి ఏ వరద బాధితులకు అందించారో చెప్పాలన్నారు. దాతల దగ్గర నుంచి వందల కోట్ల రూపాయలు డబ్బులు వసూలు చేశారని, బాధితుల ఇబ్బందులు చూసి సహాయం చేయడం కోసం దాతలందరూ ముందుకు వచ్చారన్నారు. దానికి లెక్కాపత్రం లేకుండా దోచ్చుకున్నారని దుయ్యబట్టారు. ప్రతి ఇంటికి లక్ష నుంచి ఐదు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని.. ఎవ్వరికీ సహాయం అందించలేదన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం తమ పార్టీ పక్షాన పోరాటం చేసి, వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

భక్తి పారవశ్యం.. ఆనంద పరవశం



శ్రీ ధాన్యలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం జగన్మాత కనకదుర్గమ్మ శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చి పూజలు అందుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి, ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం వేళ పంచహారతుల సేవలోనూ భక్తులు పాల్గొన్నారు.

– వన్‌టౌన్/చిట్టినగర్/భవానీపురం




శ్రీ మహాలక్ష్మీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



శ్రీగంగానమ్మ, దుర్గ మారెమ్మ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో శ్రీమహాలక్ష్మీ దేవిగా..



మహాలక్ష్మీదేవిగా విజయదుర్గా అమ్మవారు



గంగానమ్మకు మహాలక్ష్మిగా ప్రత్యేక అలంకరణ

సమైక్యతకు ప్రతీక అమీన్ పీర్ దర్గా

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కడపలోని ఆస్థాన ఏ మగ్దూముల్లాహి అమీన్ పీర్ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ మంగళవారం నగరంలోని పాత రాజరాజేశ్వరిపేటలో ఉన్నా తన శిష్యుడు షేక్ ఖాజా స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ శిష్య బృందం పెద్ద సంఖ్యలో హాజరై ఆయన ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సర్వ మానవాళి కోసం దేశం, రాష్ట్రం ఎల్లవేళల సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రతేక ప్రార్థనలు చేశారు. కడప పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాలు వచ్చే నెల 16న ప్రారంభం అవుతాయని, ఈ ఉరుసు మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆరీఫుల్లా మాలిక్ పిలుపునిచ్చారు.